సాక్షి ప్రకాశం

శనివారం | 13 | మే | 2023



లగ్జరీ బస్సులే లక్ష్యంగా..
లగ్జరీ బస్సుల్లో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని చోరీచేస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. - IIలో..



నల్లమల చుట్టాలు
నల్లమల అభయారణ్యం అరుదైన పక్షులకు ఆలవాలంగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వందలాది రకాల పక్షులు వలస వస్తుంటాయి. - IIలో..

గరిష్టం/కనిష్టం
41 /30

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ట్రైనీ డీఎస్పీ



ఎస్పీ మలికాగర్గ్‌కు మొక్క అందజేస్తున్న ట్రైనీ డీఎస్పీ సుబ్రహ్మణ్యం

ఒంగోలు టౌన్: ప్రకాశం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో డీఎస్పీగా శిక్షణ నిమిత్తం వచ్చిన బి.సుబ్రహ్మణ్యం శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీకి పూలమొక్క అందజేశారు.

14న ఆరు పండ్లసైజు ఎడ్ల పందేలు

రాచర్ల: వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 14వ తేదీ ఆదివారం చోళ్లవీడు గ్రామంలో ఆరు పండ్ల సైజు ఎడ్లపందేలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఎడ్ల యజమానులు 14వ తేదీ ఆదివారం 7 గంటల్లోపు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.8 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు, ఏడో బహుమతి రూ.4 వేలను అందజేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 99120 32442, 99129 95159, 95537 54266, 93479 61938 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలను తెలుసుకోవాలన్నారు.

జగనన్న కాలనీ లేఅవుట్లను జేసీ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, అధికారులు

ఒంగోలు రూరల్: ఒంగోలు రూరల్‌లోని గుండాయిపాలెం జగనన్న లేఅవుట్లను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు గృహాలు నిర్మించుకోలేని పేదవారిని గుర్తించిన ప్రభుత్వం కాంట్రాక్టర్ ద్వారా గృహాలు నిర్మిస్తోందన్నారు. నాణ్యతపరమైన లోపాలు లేకుండా వేగంగా గృహాలు నిర్మించి యజమానులకు స్వాధీనం చేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం సచివాలయ భవన నిర్మాణాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, అర్హులైన వారికి పథకాలు అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని, ఇందుకు వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, హౌసింగ్ ఏఈ పృథ్వీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నారెడ్డి, గ్రామ కార్యదర్శి ఆశీర్వాదం, సర్పంచ్ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు, పేతూరు, బాబులు పాల్గొన్నారు.

మనసును కదిలించిన నాటికలు



''లక్ష్మణరేఖ దాటితే...'' నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: స్థానిక మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్, నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ''లక్ష్మణ రేఖ దాటితే...'' నాటికను ప్రదర్శించారు. అలానే పందు క్రియేషన్స్, కొప్పోలు వారి ఆధ్వర్యంలో ''పక్కింటి మొగుడు'' అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండు గుల్ల బంగారమాయె..

పొగాకు పండుగుల్ల.. ఎందుకూ పనికిరాదని ఒకప్పుడు రైతులు పొలాల్లోనే వదిలేసేవారు. కూలీలు ఏరుకుని కిలో రూ.పదికో.. పరకకో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అలాంటి పండుగుల్లకు ప్రస్తుతం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రేటు కొండెక్కి కూర్చుంది. గతేడాది మార్కెట్లో లో గ్రేడ్ పొగాకు ధర పలికింది. ఈ ఏడాది నుంచి పండు గుల్లను కూడా వేలం కేంద్రాల వద్దే కొనుగోలు చేయాలని పొగాకు బోర్డు నిర్ణయించింది. దీంతో పండుగుల్ల పొగాకు కాస్తా బంగారమైంది.

- తగ్గిన లో గ్రేడ్ పొగాకు
- పండుగుల్లకు పెరిగిన డిమాండ్
- గతంలో క్వింటా రూ.2 వేలు
- నేడు క్వింటా రూ.8 వేలు
- వేలం కేంద్రాల ద్వారా కొనుగోలుకు బోర్డు గ్రీన్ సిగ్నల్
- రైతుల్లో రెట్టించిన ఆనందం
- వ్యాపారుల ఎత్తులకు చెక్ పెట్టేలా బోర్డు చర్యలు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పొగాకు ఒకటి. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 30,240 మంది రైతులు పొగాకు సాగుచేస్తున్నారు. బోర్డు నిర్దేశించిన ప్రకారం 87.61 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి చేయాల్సి ఉంది. అయితే, 107 మిలియన్ కేజీలు ఉత్పత్తి అయింది. అదనంగా పండిన దానిని కూడా కొనుగోలు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఇదిలా ఉండగా సాగు సమయంలో వడిలిపోయిన ఆకు, కోతలు పూర్తయిన తర్వాత నిస్సారమైన ఆకులను పండుగుల్ల అంటారు. వీటిని కాల్చేందుకు అవకాశం ఉండదు, దీంతో రైతులు వీటిని పొలాల్లోనే వదిలేస్తుంటారు. పండుగుల్ల ఆకును కూలీలు మార్కెట్లో విక్రయించుకునే వారు. అయితే రెండేళ్లగా లో గ్రేడ్ పొగాకు తక్కువగా రావడంతో పండుగుల్లకు మార్కెట్లో మంచి డిమాండ్ వచ్చింది.

ఐదారు మిలియన్ కేజీల పండుగుల్ల దిగుబడి...

ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలోని ఎస్ఎల్ఎస్, ఎస్‌బీఎస్ వేలం కేంద్రాల పరిధిలో ఈ ఏడాది దాదాపు ఐదారు మిలియన్ కిలోల పొగాకు పండుగుల్ల దిగుబడి అయింది. ఈ ఏడాది అకాల వర్షాలు పడటంతో పాటు డిసెంబర్‌లో వచ్చిన మాండూస్ తుఫానుతో పొగాకు పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో ముందు వేసిన పంటను పీకేసి రెండోసారి మళ్లీ వేసుకున్నారు. దీంతో పంట దిగుబడి ఎక్కువ రావటంతో పాటు నాణ్యమైన పొగాకు 70 శాతం దిగుబడి రాగా, లో గ్రేడ్ పొగాకు 30 శాతం దిగుబడి వచ్చింది. అందులోనూ పండిన పంటలో 5 నుంచి 6 శాతం పండుగుల్ల పొగాకు దిగుబడి వచ్చింది. బోర్డు నిర్దేశించిన పంట దిగుబడి 87.61 మిలియన్ కేజీలు. అయితే, మాండూస్ తుఫాను వల్ల రెండుసార్లు పంట వేయడం వలన 107 మిలియన్ కిలోల పొగాకు పంట దిగుబడి వచ్చింది. అంటే 19.39 మిలియన్ కిలోల పొగాకు దిగుబడి అదనంగా వచ్చింది.



ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రంలో పండుగుల్ల వేలం (ఫైల్)

కూటమి కట్టిన చిన్న వ్యాపారులు...

పండుగుల్లను వేలం కేంద్రాల్లో కొనుగోలు చేయకుండా పొగాకు చిన్న వ్యాపారులు కూటమికట్టి మోకాలడ్డారు. పొగాకు ఫుల్ బోర్డు కమిటీలో పండుగుల్లను కొనుగోలు చేయాలని తీర్మానించి ఒంగోలు-2వ వేలం కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించారు. అయితే, బోర్డులో ఎక్కువ ధర వెచ్చించి కొనాల్సి వస్తుందని భావించిన వ్యాపారులు కూటమి కట్టి వేలాన్ని బహిష్కరించారు. అందుకోసం ఒంగోలు-2లో నామమాత్రంగా కొనుగోలు చేసిన వ్యాపారులు తిరిగి వేలంలో పాల్గొనలేదు. దీంతో రైతుల్లో నిరాశ పెరిగిపోయింది. బయట మార్కెట్‌లో కిలో రూ.80 ఉన్న పండుగుల్లను వేలం కేంద్రంలో రూ.60కి మాత్రమే కొనుగోలు చేశారంటే.. వ్యాపారుల ఎత్తుగడలు ఏ విధంగా ఉన్నాయో స్పష్టమవుతోంది. అది కూడా కేవలం 11 బేళ్లు మాత్రమే కొనుగోలు చేసి చేతులు దులుపుకున్నారు. బయట అడ్డగోలుగా ఎంత తక్కువ ధరకు దొరికితే అంత తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న చిన్న వ్యాపారులు వేలం కేంద్రాల్లో అమ్మకాలను సహించలేకపోతున్నారు. అందువల్ల పొగాకు బోర్డు కూడా ఎస్ఎల్ఎస్‌లో ఏర్పాటు చేయాల్సిన పండుగుల్ల వేలాన్ని ఇంకా ప్రకటించలేదు.

రూ.2 వేల నుంచి రూ.8 వేలకు చేరిన ధర...

గతంలో పండుగుల్ల బహిరంగ మార్కెట్లో క్వింటా రూ.2 వేలు పలికేది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇంకా తక్కువకు కూడా విక్రయించేవారు. అలాంటిది ఈ ఏడాది లో గ్రేడ్ తక్కువ దిగుబడి రావడంతో దీని రేటు పెరిగింది. ప్రస్తుతం రూ.8 వేలకు పెరిగింది. దీంతో చిన్న వ్యాపారుల కన్ను బయట మార్కెట్ మీద పడింది. అందుకే బోర్డులో అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నారు.

రెండో వేలం కేంద్రాన్ని ఇంకా ప్రకటించలేదు

పండుగుల్ల కొనుగోలుకు రెండో వేలం కేంద్రాన్ని ఇంకా ప్రకటించలేదు. ఎస్‌బీఎస్‌లో దిగుబడి వచ్చిన పండుగుల్లకు ఒంగోలు-2లో వేలం నిర్వహించారు. బోర్డు రెండో వేలం కేంద్రాన్ని ప్రకటిస్తే అక్కడ కూడా నిర్వహిస్తాం.

– ఎం.లక్ష్మణరావు, ఆర్ఎం, ఒంగోలు పొగాకు బోర్డు

వేలం కేంద్రాల ద్వారానే కొనుగోలు చేయాలి



పండుగుల్లను వేలం కేంద్రాల ద్వారానే కొనుగోలు చేయాలి. బయట మార్కెట్‌లో కొనుగోళ్లను నిషేధించాలి. పొగాకు బోర్డు మంచి నిర్ణయం తీసుకుంది. అయితే వ్యాపారులు ముందుగానే పసిగట్టి బయట మార్కెట్లో కొనుగోళ్లు ముమ్మరం చేశారు. వచ్చే సంవత్సరం నుంచి కచ్చితంగా వేలం కేంద్రాల ద్వారానే కొనుగోలు చేస్తే రైతులు నష్టాల నుంచి బయట పడతారు.

– వడ్డెళ్ల ప్రసాదు, ఒంగోలు-2 వేలం కేంద్రం అధ్యక్షుడు

పొగాకు రైతుకు మేలు



పండుగుల్లను వేలం కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు మంచి జరుగుతుంది. గతంలో ఎప్పుడూ రాని విధంగా ఈ సంవత్సరం పండుగుల్ల ఎక్కువగా వచ్చింది. అదేవిధంగా లో గ్రేడ్ పొగాకు తక్కువ దిగుబడి రావడంతో పండుగుల్లకు మంచి గిరాకీ వచ్చింది. వేలం కేంద్రంలో పండుగుల్లను అమ్మకానికి పెడితే వ్యాపారులు సక్రమంగా కొనుగోలు చేయడంలేదు. ఎస్ఎల్ఎస్‌లో ఇంకా వేలం కేంద్రాన్ని కూడా బోర్డు ప్రకటించలేదు.

– అబ్బూరి శేషగిరిరావు, వెల్లంపల్లి వేలం కేంద్రం అధ్యక్షుడు

చుక్కల భూముల సమస్య పరిష్కారంతో మేలు

- జిల్లాలో 37,615 ఎకరాల చుక్కల భూమి
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



లబ్ధిదారులకు 1బీ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎం.వెంకయ్య

ఒంగోలు అర్బన్: చుక్కల భూముల (22ఏ) నుంచి తొలగించడం వలన రైతులకు, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కారం కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. దీనికి అనుబంధంగా ప్రకాశం భవనంలో కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు 1(బీ) సర్టిఫికెట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,615 ఎకరాలు చుక్కల భూమి పేరుతో ప్రభుత్వ భూమి కింద నిషేధిత జాబితాలో ఉందన్నారు. ఇటువంటి భూములను రిజిస్ట్రేషన్ చేయడం, తాకట్టు పెట్టుకోవడం, వెబ్‌ల్యాండ్‌లో పేరు అప్‌డేట్ చేసుకోవడం వంటి వాటికి అవకాశం లేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే రైతు భరోసా, పంట నష్టం వంటివి వర్తించవన్నారు. 2016 నుంచి దాదాపు ఇప్పటి వరకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మన జిల్లాలో చుక్కల భూములను గుర్తించామని తెలిపారు. 2016కు ముందు 12 ఏళ్ల సాగులో ఉండి దాని వివరాలు అడంగల్‌లో కానీ 1(బి), పాత 1(ఏ)లో కానీ, పాత పట్టాలో పేరు నమోదై ఉండి, వారికి ఎక్కడైనా రిజిస్ట్రేషన్ జరిగి ఉండి, లేక 1952–56 వరకు రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌లో వాడిన రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్ అనే డాక్యుమెంట్‌లో ఎక్కడైనా పట్టాదారు పేరు నమోదై ఉంటే ప్రభుత్వ నిషేధిత 22(ఏ) జాబితా నుంచి తొలగించి, వారందరికీ పక్కాగా ప్రైవేటు పొలంగా గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమంతో జిల్లాలో 38 మండలాల్లో రెవెన్యూ రికార్డుల్లో చుక్కల భూములుగా నమోదై సుమారు 37,615 ఎకరాల భూమిని సెక్షన్ 22ఏ(1)(ఈ) నుంచి ప్రభుత్వం తొలగించిందన్నారు. దీంతో జిల్లాలో సుమారు 25,052 కుటుంబాలకు సుమారు రూ.3 వేల కోట్ల విలువైన లబ్ధి చేకూరిందని చెప్పారు. ప్రజలకు మేలు జరిగే ఈ కార్యక్రమం చేపట్టిన ముఖ్యమంత్రికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యేలు ఆయా నియోజకవర్గాల్లో లబ్ధిపొందిన రైతులకు 1(బీ) సర్టిఫికెట్‌ను అందజేస్తారని తెలిపారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, డీఆర్ఓ శ్రీలత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీడీసీసీబీ చైర్మన్ ఎం.వెంకయ్య, జేసీ కె.శ్రీనివాసులు

జగనన్న కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ దినేష్ కుమార్



టంగుటూరులో జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దినేష్ కుమార్

టంగుటూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు అధికారులు పరిష్కరించి ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. టంగుటూరులోని ఆలకూరపాడు రోడ్డులోని జగనన్న కాలనీని శుక్రవారం సందర్శించి, అక్కడ ఉన్న లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని పేదలకు కేటాయించిన పక్కా గృహాలు వంద శాతం నిర్మాణాలు ప్రారంభం కావాలన్నారు. పేదలకు మేలు చేయడానికి ప్రభుత్వం నిబంధనలను సవరించిందన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులంతా తమ గృహాలు నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, ఇనుము, సిమెంటు అందుబాటులో ఉంచాలన్నారు. నిర్మాణ సామగ్రి కొరత రానివ్వరాదని సూచించారు. ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల ద్వారా అందిస్తున్న రుణంతో నిర్మాణాలు ప్రారంభిస్తే, త్వరితగతిన బిల్లులు చెల్లిస్తానన్నారు, కొందరు బేస్ మట్టం వేసి వదిలేస్తున్నారని, వారి పట్టా రద్దు చేసి, అర్హులైన వారికి పట్టా అందిస్తామన్నారు. మౌలిక వసతులు కరెంటు, మంచి నీటి సరఫరాకు ప్రభుత్వం మొత్తం రూ.40 లక్షలతో కల్పించిందన్నారు. అనంతరం సచివాలయం- 2 పరిశీలించి అక్కడ పారిశుధ్యం సక్రమంగా లేదని ఆ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే టంగుటూరు నాలుగు సచివాలయాల పరిధిలో పారిశుధ్యం లోపించిందని సంబంధిత కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆయన వెంట తహశీల్దార్ సంజీవరావు, ఎంపీడీవో రత్న జ్యోతి, ఈఓఆర్డీ నర్రా జగదీష్ బాబు, హౌసింగ్ ఈఈ పెరుగు శ్రీనివాసులు, ఏఈ రియాజ్, సర్పంచ్ మద్దిరాల మమత, వెలుగు ఏపీఎం హనుమంతు రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు, ఏపీఓ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలతో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ మలికా గర్గ్



జిల్లా జైలులో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: కట్టుదిట్టమైన భద్రత నడుమ జైలు నడిచేలా అన్నీ రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఖైదీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు. శుక్రవారం జిల్లా జైలును సందర్శించిన ఆమె జైలు భద్రతపై అధికారులు, సెక్యూరిటీ కమిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా జైలుతో పాటుగా జిల్లాలోని సబ్‌జైళ్లలో రిమాండ్ ఖైదీలను తరలించే సమయంలో పోలీసు, జైలు సిబ్బంది సమన్వయంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. జైళ్లలో భద్రతా లోపాలు తలెత్తకుండా అవసరమైన అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత ఉండేలా చూడాలని, జైలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎటువంటి భద్రతా సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, ఖైదీల్లో పరివర్తన కోసం తీసుకోవాల్సిన సత్ప్రవర్తనా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, ఏఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్ రావు, జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీఎస్పీ అశోక్ బాబు, జిల్లా సబ్‌జైలు అధికారి వెంకటరెడ్డి, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కుమారులు పట్టించుకోలేదని..

- ఆత్మహత్యకు యత్నించిన తల్లి
- కాపాడిన మెరైన్ పోలీసులు



వెంకట రమణమ్మ తో మెరైన్ పోలీసులు

సింగరాయకొండ: కన్నకొడుకులు ఆస్తులు పంచుకుని తల్లిని పట్టించుకోకపోవటంతో మనస్తాపం చెందిన ఆ తల్లి ప్రకాశం జిల్లా పాకల బీచ్‌లో ఆత్మహత్యకు యత్నించగా అది గమనించిన మెరైన్ పోలీసులు ఆమెను కాపాడి కొడుకుల వద్దకు చేర్చిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. మెరైన్ పోలీసుల కథనం ప్రకారం నెల్లూరు జిల్లా కందుకూరు మండలం పందళ్లపాడు గ్రామానికి చెందిన కోణం వెంకట రమణమ్మ (80) భర్త వెంకారెడ్డి చాలా రోజుల క్రితం మరణించాడు. ఈమెకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి చనిపోయిన తరువాత కొడుకులు అడవిరెడ్డి, సుబ్బారెడ్డిలు తమ 8 ఎకరాల పొలాన్ని, ఆస్తులు పంచుకుని తల్లి వెంకట రమణమ్మను మాత్రం వారి ఇంటి వద్ద ఉన్న రేకులషెడ్డులో ఉంచారు. ఈమె బాగోగులు పట్టించుకోకపోవటంతో ప్రతినెలా ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పింఛన్ ఆమెకు ఆధారమై బతుకు భారంగా జీవిస్తోంది. రోజులు గడుస్తున్నా కొడుకులు పట్టించుకోకపోవటం, వయస్సు పైన పడటంతో గత్యంతరం లేక శుక్రవారం వెయ్యి రూపాయలు చేత పట్టుకుని బస్సులో సింగరాయకొండ వచ్చి అక్కడ నుంచి పాకల బీచ్‌కు ఆటోలో వచ్చింది. తాను చనిపోతానన్న వేదనలో తన వద్ద ఉన్న వెయ్యి రూపాయలను ఆటోవాలాకు ఇచ్చి నేరుగా సముద్రంలోకి వెళ్లి మునిగే ప్రయత్నం చేసింది. తీరం వెంట బందోబస్తు నిర్వహిస్తున్న మెరైన్ కానిస్టేబుల్ టీ రమేష్, హోంగార్డు కే మస్తానయ్య ఇద్దరు సముద్రంలోకి వెళ్లి పడిపోయిన ఆమెను ఒడ్డుకు చేర్చారు. హోంగార్డు మస్తానయ్య సమీపంలోని తన ఇంటికి వెళ్లి ఆమెకు చీర తీసుకుని రావటంతో పాటు భోజనం కూడా పెట్టాడు. తర్వాత ఆమె సేద తీరిన తరువాత ఆమె వివరాలు అడిగి తెలుసుకుని పరిస్థితిని ఆమె కుమారులకు తెలపటంతో ఇద్దరు కుమారులు వచ్చి ఆ తల్లిని తమ వెంట తీసుకుని వెళ్లారు. వృద్ధురాలిని కాపాడటంతో పాటు ఆమెను కొడుకుల వద్దకు చేర్చిన సిబ్బంది రమేష్, మస్తానయ్యలను రామాయపట్నం మెరైన్ సీఐ కిషోర్‌కుమార్, పర్యాటకులు, గ్రామస్తులు అభినందించారు.

పారిశ్రామిక శిక్షణకు బాలికలకు ఆహ్వానం

ఒంగోలు టౌన్: 2023–24 సంవత్సరాలకుగాను ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (బాలికలు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.ఉమా మహేశ్వరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) కోర్సులతో పాటుగా కొత్తగా 6 నెలల కాలపరిమితితో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు తొలి విడత దరఖాస్తులను ఐటీఐ డాట్ ఏపీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 10 నుంచి జూన్ 6వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రింటు కాపీని డౌన్‌లోడ్ చేసుకోవాలని, దరఖాస్తుతో పాటుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో జూన్ 7న జరిగే వెరిఫికేషన్‌కు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9603041678కు ఫోన్ చేయాలని తెలిపారు.

సత్తా చాటిన గుంటూరు గిత్తలు


పోటీలను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

మార్కాపురం: మండలంలోని చింతగుంట్ల వీరాంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలను మార్కెట్ యార్డ్ చైర్మన్ గొలమారి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో గుంటూరు జిల్లా మద్దిరాలకు చెందిన శేషాద్రి చౌదరి ఎడ్ల జత 4,750 అడుగుల దూరం బండ లాగి ప్రథమ బహుమతి రూ.50 వేలు, నంద్యాల జిల్లా క్రాంతినగర్‌కు చెందిన ఎం.భావనారెడ్డి, గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి సంయుక్త ఎడ్ల జత 4,749 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి రూ.40 వేలు, కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన హేమలతానాయుడు ఎడ్ల జత 4,500 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి రూ.30 వేలు సొంతం చేసుకున్నాయి. అలాగే చాగంటి నాగేశ్వరరెడ్డి, సతీష్ నాయుడు, మందటి వెంకటరెడ్డి ఎడ్ల జతలు వరుసగా 4, 5, 6వ బహుమతులు గెలుపొందాయి. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు.

బండలాగుడు పోటీల్లో సత్తాచాటిన వైఎస్సార్ కడప జిల్లా ఎద్దు

కంభం: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని మండలంలోని రావిపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీల్లో కడప జిల్లా బ్రహ్మంగారి మఠానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎద్దు 3300 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటాయి. కడప జిల్లా దువ్వూరుకు చెందిన మొలకల చిన్న వీరన్నయాదవ్ ఎద్దు 3291.11 అడుగులు లాగి ద్వితీయ స్థానం, కడప జిల్లా కలసపాడుకు చెందిన వై. జనార్ధన్, ప్రకాశం జిల్లా సీఎస్‌పురానికి చెందిన వెంకటాద్రి ఎద్దు సంయుక్తంగా 3197.07 అడుగులు లాగి తృతీయ స్థానం, అర్ధవీడు మండలం అచ్చంపేటకు చెందిన కామన బోయిన వెంకటాద్రి ఎద్దు 3114.07 అడుగులు లాగి నాల్గవస్థానం, యర్రగొండపాలెం మండలం కొత్తపల్లెకు చెందిన కొలూరి హుస్సేన్ ఎద్దు 3008.07 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతుల కింద రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు.

నల్లమల చుట్టాలు!

వింతైన పక్షులు.. వినసొంపైన రాగాలు.. చెట్లపై గలగలలు.. రకరకాల దేశ, విదేశీ పక్షులకు నల్లమల ఆతిథ్యమిస్తోంది. ఖండాంతరాలు దాటుకొని వేల కిలోమీటర్ల దూరం పయనించి గగనతలంలో విహరిస్తున్న విహంగాలకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారాయి. ప్రకృతి అందాలకు నెలవుగా ఉన్న నల్లమలలో వైవిధ్యమైన వాతావరణం ఉండడంతో ఏటా 140 నుంచి 150 విదేశీ పక్షులు విడిదికి వచ్చి సంతానోత్పత్తి చేసి వెళ్తుంటాయి. శనివారం వలస పక్షుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

మార్కాపురం




వలస విహంగాల విడిది నల్లమల అభయారణ్యం

- భారత్‌కు ఏటా 550కి పైగా పక్షి జాతుల వలస
- 140 నుంచి 150 రకాల పక్షులకు ఆతిథ్యమిస్తున్న నల్లమల
- అలస్కా నుంచి 13,560 కి.మీ దూరం ప్రయాణించి వస్తున్న గాడ్విట్ పక్షి


నాబ్ బిల్డ్ డక్

ఏమిటీ వలస పక్షుల దినం?

ఏటా మే నెల 2వ శనివారాన్ని అంతర్జాతీయ వలస పక్షుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వలస పక్షుల స్థావరాలు, వాటి రక్షణ, జీవనశైలి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వాటి మనుగడపై విస్తృతంగా ప్రచారం చేస్తారు. యూనెస్కో 2006 మే 2వ శనివారం ప్రపంచ వలస పక్షుల దినోత్సవంగా ప్రకటించినప్పటి నుంచి అటవీ శాఖ అధికారులు, పక్షి ప్రేమికులు పక్షుల జీవనశైలిపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.


గ్రే హెరాన్స్

ప్రపంచంలో 10 వేల పక్షి జాతులు

ప్రపంచ వ్యాప్తంగా 9 వేల నుంచి 10 వేల వరకు వివిధ రకాల పక్షి జాతులు ఉన్నాయి. పర్వతాలు, అరణ్యాలు, మంచు ప్రదేశాలు, ఎడార్లు, జనావాసాల్లో నివసిస్తున్న పక్షులు కీటకాలు, గింజలు, పండ్లు తింటూ జీవిస్తుంటాయి. యూరోప్ దేశాలతో పాటు రష్యా, అమెరికా, జపాన్, కజకిస్తాన్, పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ తదితర దేశాల నుంచి పక్షులు ఆహారం, విడిది కోసం వలస వస్తుంటాయి. ఆహారం కోసం ఖండాలు దాటి శీతల దేశాల నుంచి నల్లమల అరణ్యానికి వస్తుండటం విశేషం. ఇందులో అత్యాధిక దూరం ప్రయాణించే పక్షి బార్ టైల్డ్ గాడ్విట్. ఇది అలస్కా నుంచి 13,560 కిలోమీటర్లు ఎక్కడా ఆగకుండా ప్రయాణించి నల్లమల అటవీ ప్రాంతానికి వస్తుందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. మన దేశంలో దాదాపు 13 వందల రకాల పక్షి జాతులున్నాయి. హిమాలయ పర్వతాల నుంచి కూడా కొన్ని పక్షులు నల్లమల అటవీ ప్రాంతానికి వలస వస్తున్నాయి.

నల్లమలకు 150 రకాల విదేశీ పక్షుల రాక

భారతదేశానికి సుమారు 550 రకాల విదేశీ విహంగాలు వలస వస్తుండగా, అందులో 140 నుంచి 150 జాతుల పక్షులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన నల్లమల అభయారణ్యంలో ఆతిథ్యం పొందుతున్నాయి. దాదాపు 29 దేశాల నుంచి వచ్చే ఈ పక్షులు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఇక్కడికి వచ్చి సంతానోత్పత్తి చేసి ఏప్రిల్, మే నెలలో సొంత గూటికి చేరతాయి.

ఎంతెంత దూరం..!

హెరాన్స్, డక్స్, ఓరిహెన్స్, గుడ్లగుబలు, హరియర్స్, గల్స్, టెర్న్స్, స్టార్క్స్, సైబిరియన్ క్రేన్స్, ఫాల్కన్స్, లింగ్స్, హెలికాక్స్, కుకూస్ తదితర పక్షులు నల్లమల అటవీ ప్రాంతానికి వలస వస్తున్నాయి. సుమారు 5 వేల నుంచి 12 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి రాష్ట్రానికి చేరుకుంటున్న వలస పక్షులు నల్లమలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. షార్ట్ ఈర్డ్ ఓల్ బ్రిటన్ నుంచి వలస రాగా హరియర్, గ్రే హెరాన్స్ యూరోప్ దేశాల నుంచి, నాబ్ బిల్డ్ డక్ మడగాస్కర్ నుంచి, బ్లాక్ హెడ్డెడ్ ఈబిస్ మంగోలియా, జపాన్, కొరియా నుంచి, పెలికాన్ యూరోప్ నుంచి వలస వస్తున్నాయి. మార్ష్ హరియర్ అనే పక్షి చిన్న చిన్న పక్షులను ఆహారంగా భుజిస్తుంది. గడ్డి మైదానాలకు మాత్రమే ఈ పక్షులు వస్తాయి. నల్లమలలో ఇటువంటి అనువైన వాతావరణం ఉంది. మిడతలు, చిన్న చిన్న పురుగులనూ ఇవి ఆరగిస్తాయి.

నల్లమల ఓ అద్భుతం



నల్లమల అభయారణ్యం ఎంతో అద్భుతమైన ప్రదేశం. అన్ని రకాల పక్షులు, వన్య ప్రాణులకు చాలా అనువైన ప్రాంతం. అన్ని రకాల జంతువులకు ఇక్కడ ఆహారం దొరుకుతుంది. ఒక్కో పక్షి జీవన విధానం ఒక్కో రకంగా ఉంటుంది. విదేశీ పక్షుల రాకతో నల్లమల అటవీ ప్రాంతం చరిత్రకెక్కింది.

– మహమ్మద్ హయాత్, ఎఫ్ఆర్ఓ
బయోడైవర్సిటీ కేంద్రం, శ్రీశైలం


పాలిడ్ హారియర్


బ్లాక్ హెడ్డెడ్ ఇబిస్


పెలికాన్


ఇండియా పిట్ట

'వెలిగొండ'పనుల పురోగతిపై హర్షం

- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన వైపాలెం నేతలు


సీఎం వైఎస్ జగన్‌తో మంత్రి సురేష్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పిచ్చయ్య

త్రిపురాంతకం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్, వైపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం చేయడం, టి-5 సప్లయ్ చానల్‌కు రూ.83 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, కోట్ల సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

సకాలంలో పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి


అధికారులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

ముండ్లమూరు: విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కిట్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆదేశించారు. స్థానిక హైస్కూల్‌ను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, విద్యాకిట్లు పక్కదారి పట్టకుండా ఉండేందుకు ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ముండ్లమూరులో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి సరఫరా అయిన పాఠ్యపుస్తకాలు, జగనన్న విద్యా కిట్లు స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఉన్నవా లేవా అని పరిశీలించారు. తానే స్వయంగా లెక్కలు వేసి వివరాలు సేకరించారు. ఆయన వెంట ఆర్‌జేడీ సుబ్బారావు, డీఈఓ రమేష్, ఎంఈఓ చంద్రమోహన్, హెచ్‌ఎం సుజాత ఉన్నారు.

లగ్జరీ బస్సులే లక్ష్యంగా..


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ క్రైం ఎస్వీ శ్రీధర్‌రావు

- చోరీలు చేస్తున్న యువకుడి అరెస్టు
- రూ.7.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ఒంగోలు టౌన్: అతడి వయసు 26. వృత్తి దొంగతనాలు. అలాగని చిల్లర మల్లర దొంగతనాలు చేయడు. ఇళ్లకు కన్నాలు వేయడు. రాత్రయ్యే సరికల్లా నీట్‌గా తయారవుతాడు. దర్జాగా లగ్జరీ బస్సులు ఎక్కుతాడు. ప్రయాణికుడిలా నటిస్తాడు. తోటి ప్రయాణికులు నిద్రలోకి జారుకోగానే వచ్చిన పని మొదలుపెడతాడు. ప్రయాణికుల బ్యాగులు వెతికి నగలో..నగదో చేతికి దొరకగానే చక్కగా అక్కడి నుంచి జారుకుంటాడు. అతడి పేరు కొండపనేని సుధాకర్. ఊరు అమరావతి మండలం నరుకులపాడు గ్రామం. ఇప్పటికే ఈ దొంగ అనేక బస్సుల్లో చోరీలు చేశాడు. చివరికి ప్రకాశం జిల్లా పోలీసులకు చిక్కాడు. ఎప్పటిలాగే ఈ నెల 4వ తేదీ బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న కేఎస్ఆర్టీసీ ఏసీ స్లీపర్ ఎక్కాడు. ప్రయాణికులు నిద్రపోతున్న సమయంలో ఓ ప్రయాణికురాలికి చెందిన హ్యాండ్ బ్యాగులోని 124 గ్రాముల బంగారు నగలు దొంగతనం చేశాడు. కాసేపటి తర్వాత దొంగతనం జరిగిన విషయం పసిగట్టిన సదరు మహిళ.. బస్సు ఒంగోలు రాగానే స్థానిక తాలూకా పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్.. ఏఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్‌రావు పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఒక టీంను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో పాటు ఇతర కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసు బృందం నిందితుడు కొండపనేని సుధాకర్‌గా గుర్తించి గురువారం సాయంత్రం గుంటూరులో ఉండగా అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.7.40 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కృష్ణా జిల్లా జగ్గయ్యపేట, మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలనగర్, రాజపూర్, సైబరాబాద్ పోలీసుస్టేషన్ల పరిధిలో బస్సుల్లో ప్రయాణికుల వద్ద దొంగతనాలు చేస్తూ పట్టుబడిన కేసులు నమోదై ఉన్నాయని ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్‌రావు తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, తాలూకా సీఐ రాంబాబు పాల్గొన్నారు.

ఎస్పీ అభినందనలు...

ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా తక్కువ వ్యవధిలోనే నిందితుడిని అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, తాలూకా సీఐ రాంబాబు, ఎస్ఐలు కె.అంకమ్మ, రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు కె.రామకృష్ణ, ఆర్.రాంబాబు, కానిస్టేబుళ్లు వి.కేశవులు, కె.రవికుమార్, ఐటీ కోర్ టీం కానిస్టేబుల్ బి.అవినాష్‌లను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

సేవాభావంతో పనిచేయాలి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మానస, వైద్య సిబ్బంది

మద్దిపాడు: నర్సులందరూ సేవాభావంతో పని చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ మానస సూచించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ అందించిన సేవలకు మెచ్చి ఆమె పుట్టిన రోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహిస్తున్నారని, నర్సులంతా అదేవిధంగా ప్రజలకు సేవలందించాలని కోరారు. ప్రస్తుతం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అక్కడ కూడా మంచంలో ఉండి బయటకు రాలేని వారికి ఎంఎల్‌హెచ్‌పీలు వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు వినీల చౌదరి, జగదీష్, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో కథలు చెప్పిస్తున్న గ్రంథపాలకురాలు రోహిణి

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు రోహిణి శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న క్రమంలో విద్యార్థులకు కథలు చదవడం, వాటిని ఇతరులకు చెప్పించడంతో పాటు పెద్ద విద్యార్థులకు ఉద్యోగాలకు సంబంధించిన జనరల్ నాలెడ్జ్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారిని పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఆదివారం గ్రామ పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు. సమ్మర్ క్యాంప్‌నకు 33 మంది విద్యార్థులు హాజరయ్యారు.

14న చేజర్లమ్మ తిరునాళ్లు



చేజర్లమ్మ విగ్రహం

ఒంగోలు రూరల్: మండలంలోని చేజర్లమ్మ తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 10వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మండలి సభ్యులు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి నాటకాన్ని ప్రదర్శించారు. చివరి రోజైన 14వ తేదీ తిరునాళ్లు నిర్వహించనున్నారు. తిరునాళ్లలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఒక విద్యుత్ ప్రభ, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆధ్వర్యంలో మరొక విద్యుత్ ప్రభ ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్రభలపై ప్రముఖ ఆర్కెస్ట్రా వారు సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఒంగోలు డిపో నుంచి చేజర్లకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. కరవది బస్టాండ్ నుంచి సుమారు 50 ఆటోలను భక్తుల కోసం ఉచితంగా నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

● 19 మంది ఎంపిక

ఒంగోలు టౌన్: స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్ శివప్రసాద్ తెలిపారు. చెన్నైకి చెందిన హెచ్ఎల్ మండో ఆనంద్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ పాలిటెక్నిక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించిందని తెలిపారు. కాలేజీ స్థాయిలో ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహించిన రాత పరీక్షలో ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులతో పాటుగా వివిధ కాలేజీల విద్యార్థులు కూడా పాల్గొన్నారని, ఈ ఇంటర్వ్యూలో డీఏ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన 9 మంది, ఎస్‌యూవీఆర్ పాలిటెక్నిక్ (ఉమెన్స్) కి చెందిన ఆరుగురు విద్యార్థినులు, గూడూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన నలుగురు విద్యార్థులు ఎన్నికయ్యారని తెలిపారు.

సన్ రైజింగ్..!

సూర్యుడు భగ్గుమంటున్నాడు. వేసవి ప్రతాపం పెరిగిపోయింది. మండుటెండకు జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఇల్లు దాటి బయటకు రావాలంటే భయపడుతున్నారు. మధ్యాహ్నమైతే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- సాక్షి, ఒంగోలు









జగనన్న కాలనీల లబ్ధిదారులకు రుణాలు

● మండల ప్రత్యేక అధికారి జి.అర్చన

అల్లూరు (కొత్తపట్నం): జగనన్న కాలనీల లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు రుణాలివ్వడానికి బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని మండల ప్రత్యేక అధికారి జి.అర్చన తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామం ఆర్ఆర్ కాలనీలో జగనన్న లే అవుట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి ఎందుకు లేదని, ఎందుకు ఆలస్యమవుతుందని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, ఇంటి నిర్మాణానికి సరిపడినంత నగదు తమ దగ్గర లేదని వారు చెప్పారు. జగనన్న ఇచ్చిన పట్టాలను ఐఐఎఫ్ఏ బ్యాంక్‌లో తనఖా పెడితే రూ.లక్ష రుణం ఇవ్వడం జరుగుతుందన్నారు. దానిని ఐదు సంవత్సరాల్లో నెలకు రూ.2,400 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులు బ్యాంక్ స్టేట్‌మెంట్‌తో బ్యాంకులో సంప్రదించాలని ఆమె కోరారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా లోను, ప్రభుత్వ స్కీమ్, బ్యాంక్‌లో ఇచ్చిన లోను కలుపుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ డి.విజయకృష్ణ, సీహెచ్ శ్రీలత, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అల్లూరులో జగనన్న లే అవుట్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి అర్చన

జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులు వేగవంతం

● అధికారుల సమీక్షలో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ

ఒంగోలు సబర్బన్: జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ భవన్‌లో శుక్రవారం జిల్లాలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పురోగతిపై డివిజన్ల వారీగా సమాచారం అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మీటర్లకు సీళ్లు వేయాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలు వసూలు చేయటంలో వేగాన్ని పెంచాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు పెట్టుకున్న ప్రతి రైతుకు ఈ నెల 20వ తేదీ లోగా ఇవ్వాలని ఆదేశించారు. సీలు లేని విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీళ్లు వేయాలన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ కనెక్షన్ ఇవ్వటంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమీక్షలో ఎస్ఏఓ సుబ్బారావు, ఈఈలు కే.వెంకటేశ్వర్లు, ఉషారాణి, శ్రీనివాసులుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాడు స్పెషల్ ఆఫీసర్ వరకుమార్

● మండల స్పెషల్ ఆఫీసర్ వరకుమార్

మద్దిపాడు: పేదవాడి సొంతింటి కలను నిజం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ లబ్ధిదారులకు ఇళ్లు నిర్మిస్తున్నారని మండల స్పెషల్ ఆఫీసర్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ తెలిపారు. మండలంలోని పెదకొత్తపల్లి సచివాలయంలో ఇళ్ల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు ఇచ్చిన స్థలాలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. పెదకొత్తపల్లి గ్రామంలో లబ్ధిదారులు చాలా వరకూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని, మరికొందరు నిర్మాణాలు చేసుకుంటున్నారని అన్నారు. పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టని వారు వెంటనే పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టని వారిని పిలిచి కారణాలు తెలుసుకున్నారు. నగదు సహాయం అవసరమైన వారికి గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని ఏపీఎంను ఆయన ఆదేశించారు. జగనన్న కాలనీని పరిశీలించి అందులో మౌలిక సదుపాయాలను గమనించారు. కాలనీలో అన్ని రకాలుగా సదుపాయాలు ఉన్నాయని, లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని వారితో మాట్లాడి సమస్య ఏంటని అడిగి తెలుసుకున్నారు. ఆ స్థలాన్ని అవసరమైన వేరొకరికి బదిలీ చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజనీకుమారి, ఏవో సుబ్బారావు, హౌసింగ్ ఏఈ హేమలత, పీఆర్ ఏఈ సునీల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు వినతి

ఒంగోలు టౌన్: నగరంలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ అత్యంత వైభవంగా నిర్వహించనున్న జీవ ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ విషయంలో సహకరించాలని దేవస్థాన కమిటీ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు కోరారు. శుక్రవారం దేవస్థాన కమిటీ సభ్యులు ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావును కలిశారు. ఈ సందర్భంగా మహా కుంభాభిషేకంతో పాటు భారీ అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు పది వేల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని, భక్తులు, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీని కలిసిన వారిలో దేవస్థాన కమిటీ సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, కరేటి కిరణ్‌బాబు ఉన్నారు.



ట్రాఫిక్ డీఎస్పీని కలిసిన చెన్నకేశవస్వామి దేవస్థాన కమిటీ

తల్లిదండ్రులను అనాథలను చేయకండి

అల్లూరు (కొత్తపట్నం): పిల్లలు ప్రయోజకులు అయిన తర్వాత తల్లిదండ్రులను వదిలేస్తున్నారని, అటువంటి పని చేస్తే చట్టం చర్యలు తీసుకుంటుందని మండల ప్రత్యేక అధికారి జి.అర్చన అన్నారు. అల్లూరు గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007లో వచ్చిందన్నారు. 60 సంవత్సరాలు దాటిన తల్లిదండ్రుల పోషణ ఈ చట్టం లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి, ఆస్తి తీసుకుని తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులు, కుమార్తెలు ఈ చట్టప్రకారం శిక్షార్హులని అన్నారు. 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎల్డర్ లైన్ ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ పాటిబండ్ల జాన్‌బాబు, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



టోల్ ఫ్రీ నంబర్ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

వెలిగండ్ల: దౌర్జన్యం చేసి కొట్టి కులం పేరుతో దూషించాన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయిన సంఘన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వెలిగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన వీఆర్యే తాతపుడి సత్యానందం తన పొలంలో పని చేసుకుంటున్నాడు. ఆదే గ్రామానికి చెందిన వ్యక్తి గోరిగే ప్రసాద్ ఈ పొలం తనదని.. ఎవడివి రా నువ్వు ఇక్కడ ఉన్నావంటూ కొట్టి గాయ పర్చాడు. అలాగే కులం పేరు పెట్టి దుర్భాష లాడాడు. బాధితుడిని 108 వాహనం ద్వారా ఒంగోలు హాస్పటల్ తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. గోరిగే ప్రసాదుపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు.

మరో కేసు నమోదు...

గోరిగె ప్రసాదు తన పొలంలో ఉండగా వీఆర్యే తాతపుడి సత్యానందం పొలం నాదని నీవు ఎవడిరా నా పొలంలో ఉండటానికి అని దౌర్జన్యం చేసి దుర్భాషలాడి తిట్టి కొట్టినట్లు గోరిగే ప్రసాదు.. తాతపుడి సత్యానందం పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రసాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి.. తీవ్ర గాయాలు

గుడ్లూరు: గొడవకు పరిష్కరించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకుడిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన వీరగంధం శ్రీరాములు, బిజ్జం రఘురామిరెడ్డి స్థలం విషయంలో గొడవ పడుతుండగా విషయం తెలుసుకున్న గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు బిజ్జం సుధాకర్‌రెడ్డి అక్కడికి వెళ్లి ఇరువురితో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించుకోవాలని చెబుతుండటంతో శ్రీరాముల కుమారుడు శేషయ్య.. సుధాకర్‌రెడ్డిపై దాడి చేశాడు. దీంతో తలపై తీవ్ర గాయాలు కావడంతో సుధాకర్‌రెడ్డి కందుకూరు ఏరియా వైద్యశాలకు బంధువులు తరలించారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం

● వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి

కొత్తపట్నం: ఖరీఫ్ సీజన్ మొదలైందని, తొలకరి జల్లులకు పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వలన భూమి సారవంతం అవుతుందని వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. కొత్తపట్నంలోని రైతు భరోసా కేంద్రంలో వీఏఏలు, వీహెచ్ఏలతో పచ్చిరొట్ట ఎరువులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవడం ద్వారా సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలన్నారు. తద్వారా వేయబోయే ప్రధాన పైరులో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల వాడకం తగ్గించుకుని భూసారాన్ని కాపాడుకోవచ్చన్నారు. చీడపీడలు ఆశించకుండా నాణ్యమైన దిగుబడులు సాధిస్తారని వివరించారు. ప్రతి రైతు పచ్చిరొట్ట ఎరువులు తప్పనిసరిగా భూమిలో ఎద పెట్టాలని సూచించారు. దీనికిగానూ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర సరఫరా చేస్తోందన్నారు. మండల పరిధిలోని 15 రైతు భరోసా కేంద్రాలకు జనుము 57 క్వింటాలు, పిల్లిపెసర 14 క్వింటాలు, జనుము 2 క్వింటాల విత్తనాలు కేటాయించారని చెప్పారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులతో ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీఏఏలు, వీహెచ్ఏలను సంప్రదించాలని సూచించారు. పిల్లిపెసర కేజీ రూ.97 కాగా, 50 శాతం సబ్సిడీపోను రూ.48 చెల్లించాలని, జనుము రూ.84 ఉండగా, రూ.39 చెల్లించాలని, జీలుగ రూ.79 కాగా రూ.42 చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చని ఏవో వివరించారు.

470 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

కనిగిరి రూరల్: అక్రమంగా తరలిస్తున్న 470 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. మార్కాపురం నుంచి కనిగిరి మీదుగా నెల్లూరుకు తరలిస్తున్న అక్రమ రేషన్ బియ్యం లారీని పేరంగుడిపల్లి వద్ద పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, మార్కాపురానికి చెందిన బి. వెంకటేశ్వర్లు, మరి కొందరి వద్ద నుంచి తీసుకుని నెల్లూరు కృష్ణపట్నం పోర్ట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్‌లో దించారు. డ్రైవర్ నాగేంద్రరావు, బి. వెంకటేశ్వర్లుపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ డీటీ ఎస్‌కే షాహిదా తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ సీఐలు పీవీబీ సుబ్బారావు, ఎస్. రాఘవరావు, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్రాలు సద్వినియోగం చేసుకోండి

పీసీపల్లి: రైతు అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తముద్దపాడు, తలకొండపాడు ఆర్‌బీకేలో రైతు భరోసా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా లబ్ధిదారుల జాబితా ప్రదర్శించి ఈ నెల 15లోపు తప్పులు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ముద్దపాడులో వైఎస్సార్ యంత్ర సేవాపథకం కింద మంజూరైన రూ. 7,50,000 విలువ చేసే ట్రాక్టర్, పనిముట్లను పంపిణీ చేశారు. మండల కన్వీనర్ బొర్రా రెడ్డి, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నూతన విగ్రహ ప్రతిష్ఠ



హనుమంతునిపాడు: విశిష్ట అలంకరణలో మోపాడు గంగాభవాని మూల విగ్రహమూర్తి



పామూరు: నాంచారమ్మ గుడిలో పూజలు చేస్తున్న సత్యనారాయణరెడ్డి

నందనవనం (హనుమంతునిపాడు): మండల పరిధి నందనవనం గ్రామంలో శుక్రవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా జరిగింది. గ్రామంలో ఏర్పాటు చేసిన నాంచారమ్మ, పోలేరమ్మ, నాగమయ్యస్వామి, శివాలయంలో గణపతి, పార్వతి, వేవి నందీశ్వరిని విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించారు. హోమ పూజలు, విగ్రహ ప్రతిష్ఠ పూజలు వేద పండితుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. పూజలు హోమాల అనంతరం ఆలయాల్లో పూజలు నిర్వహించి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పాల్గొని నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయను ఆలయ కమిటీ సభ్యులు ప్రాదేశిక సభ్యులు సూరి శెట్టి నారాయణస్వామి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ వైఎస్సార్ టీఏఫ్ మాజీ గౌరవాధ్యక్షులు సానికొమ్ము ఆంజనేయరెడ్డిని సన్మానించారు.

రేపటి నుంచి మోపాడు గంగా భవాని తిరునాళ్ల...

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయరు వద్దగల గంగాభవానీ ఆలయంలో శ్రీగంగాభవానీ అమ్మవారి తిరునాళ్ల రేపు 14వ తేదీ ఆదివారం నుంచి 18వ తేదీ గురువారం వరకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. తిరునాళ్లలో భాగంగా రేపు 14 వ తేదీ ఆదివారం నిలుపు, 15,16వ తేదీ సోమ, మంగళవారాల్లో అమ్మవారి గ్రామోత్సవం, 17వ తేదీ బుధవారం అమ్మవారి జలదిస్థానం, గావు, రాయభారం, పాటకచేరీ, 18వ తేదీ గురువారం బండ్లు పొంగళ్లు, ఎడ్లచే బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సాక్షి బిజినెస్

శనివారం
13-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	123	62,028
నిఫ్టీ ▲	18	18,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,246	▽	82
డోజోన్స్	33,132	▽	176
ఎఫ్‌టీఎస్ఈ 100	7,754	▲	24
డాక్స్	15,914	▲	79
షాంఘై	3,272	▽	37
నికాయ్	29,388	▲	261

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,964	▽	621
బంగారం (22 క్యారట్)	60,720	▽	619
వెండి (కిలో)	72,040	▽	2,755

మైనర్ల పేరిట పెట్టుబడి నిబంధనల్లో మార్పులు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్‌లో మైనర్ పేరిట సంరక్షకులు చేసే పెట్టుబడులకు సంబంధించిన నిబంధనల్లో సెబీ మార్పులు చేసింది. దీని కింద మైనర్ పేరిట చేసే పెట్టుబడులకు.. వారి ఖాతా లేదా తల్లి దండ్రులు లేదా సంరక్షకుల ఖాతాల నుంచి ఏ రూపంలో అయినా చెల్లింపులను మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు అనుమతించాలి. తల్లి దండ్రి లేదా సంరక్షకులతో జాయింట్ అకౌంట్ నుంచి చెల్లింపులు చేసినా ఆమోదించాల్సి ఉంటుంది. జూన్ 15 నుంచి ఇందుకు అవకాశం కల్పించేందుకు కావాల్సిన ఏర్పాట్లను, సవరణలను చేసుకోవాలని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు (ఏఎంసీలు) సెబీ ఆదేశాలు జారీ చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ మొత్తాన్ని మైనర్ ఖాతా లేదా తల్లిదండ్రి, సంరక్షకులతో జాయింట్ ఖాతాకు మాత్రమే జమ చేయాల్సి ఉంటుంది.



రిటైల్ ధరలు దిగొచ్చాయ్!

ఏప్రిల్‌లో 4.7 శాతానికి తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం • 18 నెలల కనిష్టం • ఆహారోత్పత్తుల రేట్లు డౌన్

న్యూఢిల్లీ: కూరగాయలు, నూనెలు తదితర ఆహారోత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టానికి తగ్గింది. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించుకున్న ద్రవ్యోల్బణ పరిమితి లక్ష్యానికి కాస్త చేరువగా 4.7 శాతానికి పరిమితమైంది. చివరిసారిగా 2021 అక్టోబర్‌లో ఇది 4.48 శాతం స్థాయిలో నమోదైంది. వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఇలా తగ్గడం ఇది వరుసగా రెండో నెల. గతేడాది ఏప్రిల్‌లో ఇది 7.79 శాతంగా ఉండగా ఈ ఏడాది మార్చ్‌లో 5.66 శాతానికి పరిమితమైంది. రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (రెండు శాతం అటూ ఇటుగా) కట్టడి చేయాలని రిజర్వ్ బ్యాంక్‌ను కేంద్ర ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. తాజాగా జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన డేటా ప్రకారం ఏప్రిల్‌లో ఆహారోత్పత్తుల బాస్కెట్ ద్రవ్యోల్బణం 3.84 శాతంగా ఉంది. ఇది ఈ ఏడాది మార్చ్‌లో 4.79 శాతంగా, గత ఏప్రిల్‌లో 8.31 శాతంగా ఉంది. నూనెల ధరలు 12.33 శాతం, కూరగాయల రేట్లు (6.5 శాతం), మాంసం..చేపలు (1.23 శాతం) తగ్గాయి. అటు సుగంధ ద్రవ్యాలు, పాలు.. పాల ఉత్పత్తులు మొదలైన వాటి రేట్లు పెరిగాయి. రిటైల్ ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 4.68 శాతంగా, పట్టణ ప్రాంతాల్లో 4.85 శాతంగా ఉంది. ఎంపిక చేసిన 1,114 పట్టణ మార్కెట్లు, 1,181 గ్రామాల నుంచి క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ఆధారంగా ఎన్ఎస్ఓ ఈ డేటా రూపొందించింది. మే–జూన్ మధ్యకాలంలో సీపీఐ ద్రవ్యోల్బణం 4.7–5 శాతం శ్రేణిలో తిరుగాడవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. తాజా గణాంకాలను బట్టి చూస్తే ఆర్‌బీఐ తదుపరి పాలసీ సమీక్షలో వడ్డీ రేట్ల పెంపును నిలిపే అవకాశాలు ఎక్కువే కనిపిస్తున్నాయని, అయితే రేట్ల తగ్గింపునకు మాత్రం చాలా కాలం పట్టేయవచ్చని పేర్కొంది.



సరైన దిశలోనే పరపతి విధానం: ఆర్‌బీఐ గవర్నర్



ఏప్రిల్‌లోనూ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం 'చాలా సంతృప్తినిచ్చే' అంశమని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఇది .. ద్రవ్యపరపతి విధానం సరైన దిశలోనే సాగుతోందనే నమ్మకం కలిగిస్తోందని పేర్కొన్నారు. అయితే, దీని ఆధారంగా పరపతి విధానంలో ఏవైనా మార్పులు ఉండవచ్చా అనే ప్రశ్నకు.. తదుపరి పాలసీ సమీక్ష రోజైన జూన్ 8న దీనిపై స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించారు.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ4లో రూ. 5,408 కోట్లు
- షేరుకి రూ. 2 డివిడెండ్

న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నష్టాలను వీడి రూ. 5,408 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 1,033 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 78,439 కోట్ల నుంచి రూ. 1,05,932 కోట్లకు ఎగసింది. ఇక ఇదే కాలంలో స్టాండెలోన్ నికర లాభం రూ. 413 కోట్ల నుంచి రూ. 2,696 కోట్లకు జంప్‌చేసింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం టర్న్‌అరౌండ్ సాధించింది. రూ. 2,414 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. 2021–22లో రూ. 11,441 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,78,454 కోట్ల నుంచి రూ. 3,45,967 కోట్లకు ఎగసింది. వాటాదారులకు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించింది. డీవీఆర్‌కు రూ. 2.1 చెల్లించనుంది.

భారీ పెట్టుబడులు: గతేడాది క్యూ4లో బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్ఆర్) ఆదాయం 49 శాతం జంప్‌చేసి 7.1 బిలియన్ డాలర్లకు చేరింది. పూర్తి ఏడాదికి 25 శాతం అధికంగా 22.8 బిలియన్ డాలర్ల టర్నోవర్ సాధించింది. క్యూ4లో 24 శాతం వృద్ధితో 94,649 జేఎల్ఆర్ వాహనాలు విక్రయమైనట్లు సంస్థ తాత్కాలిక సీఈవో ఆడ్రియన్ మార్డెల్ తెలియజేశారు. పూర్తి ఏడాదికి 9% అధికంగా 3,21,362 యూనిట్ల హోల్‌సేల్ అమ్మకాలు నమోదైనట్లు వెల్లడించారు. ఇక దేశీయంగా ప్యాసింజర్ వాహన హోల్‌సేల్ విక్రయాలు 45 శాతం ఎగసి 5.38 లక్షలను తాకినట్లు టాటా మోటార్స్ పీవీ ఎండీ శైలేష్ చంద్ర పేర్కొన్నారు. 2023–24లో రూ. 38,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ వెల్లడించారు.



ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 0.8 శాతం బలపడి రూ. 516 వద్ద ముగిసింది.

62,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: వారాంతాన తొలుత నీరసంగా ప్రారంభమైన దేశీ స్టాక్ మార్కెట్లు చివరికి కోలుకున్నాయి. స్వల్ప లాభాలతో నిలిచాయి. సెన్సెక్స్ దాదాపు ఐదు నెలల తదుపరి తిరిగి 62,000 పాయింట్ల మార్క్‌ను అధిగమించింది. 123 పాయింట్లు జమ చేసుకుని 62,028 వద్ద ముగిసింది. ఇంతక్రితం 2022 డిసెంబర్ 12న ఈ స్థాయిలో నిలిచింది. నిఫ్టీ 18 పాయింట్లు పుంజుకుని 18,315 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 61,578 వద్ద కనిష్టాన్ని, 62,111 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ సైతం 18,343–18,195 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. యూఎస్, చైనా ఆర్థిక గణాంకాలు మందగమన సంకేతాలివ్వడంతో తొలుత ఇన్వెస్టర్లు నిరాశకులోనైనట్లు నిపుణులు పేర్కొన్నారు. తదుపరి తగ్గనున్న ద్రవ్యోల్బణ అంచనాలు సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు తెలియజేశారు.

బ్లూచిప్స్ డీలా: ఎన్ఎస్ఈలో ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో రంగాలు 0.75% చొప్పున పుంజుకోగా.. మెటల్, మీడియా, ఆయిల్, ఫార్మా 1.9–0.6% మధ్య డీలా పడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్ 6% జంప్‌చేయగా.. ఎంఅండ్ఎం, ఇండస్‌ఇండ్, యాక్సిస్, హెచ్‌యూఎల్, హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హీరో మోటో, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ 2–0.5% బలపడ్డాయి. ఇతర బ్లూచిప్స్‌లో హిందాల్కో, బీపీసీఎల్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్, డాక్టర్ రెడ్డీస్, సిప్లా, అదానీ పోర్ట్స్, నెస్లే, జేఎస్ డబ్ల్యూ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 3.6–1% క్షీణించాయి.



చిన్న షేర్లు వీక్

చిన్న షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బీఎస్ఈలో మిడ్ క్యాప్ 0.35 శాతం నీరసించింది. నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ. 1,014 కోట్లు ఇన్వెస్ట్ చేయగా.. దేశీ ఫండ్స్ రూ. 922 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించాయి. ఇక డాలరుతో మారకంలో రూపాయి స్వల్పంగా 9 పైసలు తగ్గి 82.18 వద్ద ముగిసింది.

పారిశ్రామికోత్పత్తి డౌన్

- మార్చిలో 1.1%; 5 నెలల కనిష్టం
- తయారీ, విద్యుత్.. పేలవ పనితీరు

న్యూఢిల్లీ: దేశీయంగా పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి మార్చిలో మందగించింది. విద్యుత్, తయారీ రంగాల పేలవ పనితీరుతో అయిదు నెలల కనిష్టానికి పడిపోయి.. 1.1%గా నమోదైంది. చివరిసారిగా 2022 అక్టోబర్‌లో అత్యంత తక్కువ స్థాయి వృద్ధి నమోదైంది. అప్పట్లో ఐఐపీ 4.1% క్షీణించింది. గతేడాది మార్చిలో ఇది 2.2% కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.8%గా ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటా ప్రకారం ...

- విద్యుదుత్పత్తి రంగం 6.1 శాతం వృద్ధి నుండి 1.6 శాతం క్షీణత నమోదు చేసింది.
- తయారీ రంగం వృద్ధి 1.4 శాతం నుంచి 0.5 శాతానికి నెమ్మదించింది.
- మైనింగ్ రంగం ఉత్పత్తి 3.9 శాతం నుంచి 6.8 శాతానికి పెరిగింది.



- క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి 2.4 శాతం నుంచి 8.1 శాతానికి ఎగిసింది.
- ప్రైమరీ గూడ్స్ వృద్ధి గత మార్చిలో 5.7% ఉండగా ప్రస్తుతం 3.3%గా నమోదైంది.
- కన్జూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి మైనస్ 3.1 శాతం నుంచి మైనస్ 8.4 శాతానికి పడిపోయింది. కన్జూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ తాజాగా మైనస్ 3.1%కి చేరింది.
- ఇన్‌ఫ్రా/ నిర్మాణ ఉత్పత్తుల వృద్ధి 5.4 శాతంగా ఉంది. గత మార్చిలో ఇది 6.7 శాతం.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఐఐపీ వృద్ధి 5.1 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 11.4%.

వేదాంతా లాభం క్షీణత

క్యూ4లో రూ. 3,132 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 57 శాతం క్షీణించి రూ. 3,132 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 7,261 కోట్లు ఆర్జించింది. అల్యూమినియం బిజినెస్ తగ్గడం, రైటాఫ్‌లు లాభాలను దెబ్బతీశాయి. అయితే త్రైమాసికవారీగా(క్యూ3) చూస్తే నికర లాభం(రూ. 3,092 కోట్లు) 1 శాతం బలపడింది. అయితే మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 37,225 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 39,342 కోట్ల టర్నోవర్ సాధించింది. జింక్ నుంచి ముడిఇనుము వరకూ కమోడిటీ ధరలు తగ్గడం ఫలితాలను ప్రభావితం చేసింది. వీటికితోడు చమురు, గ్యాస్ బిజినెస్ నుంచి రూ. 1,336 కోట్ల మేర అనుకోని నష్టం వాటిల్లినట్లు కంపెనీ వెల్లడించింది. ఇక గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 1,45,404 కోట్ల టర్నోవర్ అందుకుంది.

పెట్టుబడులకు సై

గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అనిల్ అగర్వాల్ సోదరుడు నవీన్ అగర్వాల్, కుమార్తె ప్రియా అగర్వాల్‌లను బోర్డు ఐదేళ్లపాటు డైరెక్టర్లుగా తిరిగి నియమించినట్లు వేదాంతా పేర్కొంది. చమురు, గ్యాస్ అన్వేషణకు 29.6 కోట్ల డాలర్ల పెట్టుబడి వ్యయాలకూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) 1.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలున్నట్లు వెల్లడించింది.



ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు 2.3 శాతం నీరసించి రూ. 275 వద్ద ముగిసింది.

మండు వేసవి. డీహైడ్రేషన్, తలనొప్పి, చెమట, ఒళ్లు పేలడం వంటి సమస్యలు ఎన్నింటినో మోసుకొస్తుంది. అయితే శతకోటి సమస్యలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు... కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా ఆయా సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. అలాంటి వాటిలో ఆహారం ఒకటి. వేసవి కాలంలో ఆరోగ్యకరమైన కొన్ని ఆహార పదార్థాలను డైట్‌లో భాగం చేసుకుంటే అవి శరీరాన్ని చల్లబరుస్తాయి. చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తాయి. అవేంటో చూద్దాం.

ఈ ఫుడ్ సమ్మర్‌కి సో గుడ్!



ఎండాకాలంలో ఎదురయ్యే సమస్యల్లోచర్మం పొడిబారడం ఒకటి. శరీరంలోని నీటి శాతం తగ్గినప్పుడు దాని ప్రభావం చర్మంపై పడుతుంది. ఫలితంగా చర్మం పొడిబారుతుంది. దీన్ని నివారించాలంటే ఆరారగా మంచినీటిని తాగడం మంచిది.

మజ్జిగ

వేసవి రకరకాల శుభకార్యాలకు కూడా సీజనే. ఆయా శుభకార్యాలకు వెళ్లినప్పుడు మసాలాలూ, వేపుళ్లూ, స్వీట్లూ, పచ్చళ్లతో కడుపునిండా తినేస్తాం. దీంతో గుండెలో మంట, అజీర్తి వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటప్పుడు కొంచెం ఉప్పు వేసిన పల్చని మజ్జిగ తాగితే హాయిగా ఉంటుంది. మజ్జిగలో ఉండే ప్రోబయోటిక్స్ శరీరాన్ని తేమగా ఉంచడంతోపాటు, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మజ్జిగలోని కాల్షియం, ఇతర విటమిన్ల వల్ల నాడీ వ్యవస్థ పనితీరు బాగుంటుంది.



కొబ్బరి నీళ్ళు

శరీరంలోని వేడిని తగ్గించి చల్లదనాన్ని ఇచ్చే అద్భుతమైన లక్షణం కొబ్బరి నీటిలో ఉంది. శరీరంలో సహజ లవణాల్ని కోల్పోయినప్పుడు కలిగే అలసట నుంచి కొబ్బరి నీరు కాపాడుతుంది. నీళ్ల విరేచనాలతో బాధపడే పిల్లలకు డీహైడ్రేషన్ రాకుండా కాపాడే పానీయం కొబ్బరి నీరు.



చెరుకు రసం

చెరకురసంలో ఖనిజలవణాలు అధిక పరిమాణంలో ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు చెరకు రసం తాగగానే తక్షణ శక్తి వస్తుంది. చెరకు రస లో ఉండే పొటాషియం మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, మంట వంటి సమస్యలను నివారిస్తుంది. కాల్షియం సమృద్ధిగా ఉండటం వల్ల దంతక్షయం రాదు.



సబ్జా గింజలు

సబ్జా గింజలు నానబెట్టిన నీటిని తాగడం వల్ల జీవక్రియలు చురుగ్గా జరుగుతాయి. శరీర పనితీరుకి ఉపకరించే ఫ్యాటీయాసిడ్స్‌తో పాటు అధికంగా పీచును కలిగి ఉండడం వీటి ప్రత్యేకత. మహిళలకు అవసరమైన ఫోలేట్, నియాసిన్, చర్మాన్ని అందంగా ఉంచే విటమిన్ 'ఇ' సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో పేరుకొన్న వ్యర్థాలను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తాయి.



పుచ్చకాయ

ఎండాకాలంలో పుచ్చపండు తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. వేసవి తాపాన్ని, దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ముఖ్యంగా శరీరంలో ద్రవాల పరిమాణం తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయ ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఇందులో విటమిన్లు, పోషకాలు పుష్కలం. వ్యాధి నిరోధక శక్తి పెంచే యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ 'బి', కాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, బీటాకేరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్–ఏ, విటమిన్ –బి 6, విటమిన్–సి, లెకోపిన్ సమృద్ధిగా ఉంటాయి.



తాజా ఆకుకూరలు, కూరగాయలు, కీరదోస, క్యారెట్ తీసుకోవడం వల్ల వేసవి లో వచ్చే ఎలర్జీలు, వాపు, ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. మండు వేసవి లోనూ ఆరోగ్యాన్ని పండించుకోవచ్చు.

వాల్ నట్స్

గింజల రాజుగా పిలవబడే వాల్‌నట్లలో ఫైబర్, ఒమెగా కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయి. యాంటీ ఆక్సిడెంట్లు, నిద్రని రప్పించే ట్రిప్టోఫాన్ మూలకం ఉంటుంది.



అంజీర (అత్తి పండ్లు)

పోషకాలతో పోల్చితే ఆపిల్, ఎండుద్రాక్షల కన్న అంజీరా చాలా మిన్న. పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఈ పండ్ల వల్ల మలబద్ధకం దూరమవుతుంది. చర్మ సమస్యలు రావు. అంతేకాదు, బరువు తగ్గాలనుకునేవారు వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది.



మామిడి

అధిక శాతం సి విటమిన్, ఏ విటమిన్ కలిగి ఉన్న మామిడిలో పీచు పదార్థాలు రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే పొటాషియం చెడు కొవ్వును తగ్గించి రక్తప్రసరణ వేగాన్ని మెరుగుపరుస్తుంది. దాని వల్ల గుండె సంబంధిత ఇబ్బందులు రావు.



నిమ్మ, బత్తాయి, కమలా

సిట్రిక్ జాతి పండ్లయిన నిమ్మ, బత్తాయి, కమలా వంటి వాటిలో విటమిన్ సి, ఐరన్ ఉంటుంది. ఎండాకాలంలో శరీరానికి కావల్సిన శక్తినిచ్చేవి ఇవి ఎండకు, వేడికి శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో బయటికి పోతుంది.



కొత్తిమీర, పుదీనా

కొత్తిమీర, పుదీనాలు రసం చేసుకొని తాగొచ్చు, బయట పనులు నిమిత్తం ఎండల్లో తిరిగేవారికి కూరల్లో కొత్తిమీర, పుదీనాలు ఎక్కువ మోతాదులో వేస్తే ఇవి శరీరాన్ని వడదెబ్బ నుండి కాపాడుతాయి.



ముంజెలు

వేసవిలో తాటి ముంజెల ప్రత్యేకత చెప్పనక్కర్లేదు. ప్రత్యేకంగా వేసవిలోనే లభించే ఈ ముంజలు రుచిలోనే కాదు పోషకాల్లోనూ ముందే ఉంటాయి.



అరటి, సపోటా, దానిమ్మ, ద్రాక్ష

ఎండాకాలం అయితే తక్షణశక్తి కోసం అరటిని ఆశ్రయించాల్సిందే. వేసవి కాలంలో దాహం ఎక్కువగా ఉంటుంది. దాహార్తిని తీర్చేందుకు సపోటా మంచి ఫలం. పోషకాలతో పాటు జీర్ణక్రియ సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తూ, అందాన్ని కాపాడే పండు దానిమ్మ. ఇందులో పీచు పదార్థాలు కూడా ఎక్కువే.




హై బీపీని అదుపులో ఉంచే యోగం

అధిక రక్తపోటు ఉన్న రోగులకు గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎక్కువ పవర్ ఉన్న మందులను వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. అయితే వాటివల్ల కొన్ని సైడ్ ఎఫెక్టులు తప్పవు. అలా కాకుండా కొన్ని రకాల యోగాసనాలను వేయడం ద్వారా అధిక రక్తపోటు అదుపులోకి వస్తుందని యోగనిపుణులు చెబుతున్నారు. అవేమిటో చూద్దాం.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం , క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి యోగా అనేది ఫిట్‌గా ఉండటానికి ఒక పురాతన మార్గం. యోగా అధిక రక్తపోటును నియంత్రించడంతోపాటు ఒత్తిడిని దూరం చేస్తుంది. ఏ యోగాసనాలు అధిక రక్తపోటును నియంత్రించగలవో తెలుసుకుందాం.

1. **బాలాసన...** అధిక రక్తపోటు ఉన్న రోగులకు బాలాసన భంగిమ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యల నుండి మీకు ఉపశమనం కలిగిస్తుంది. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ ఆసనం ఒత్తిడిని తగ్గిస్తుంది ,శరీరం అంతటా రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ ఆసనం మెడ, భుజాల నుండి ఒత్తిడిని తగ్గిస్తుంది.
2. **సుఖాసనం...** శ్వాసను నియంత్రించడం ఇందులో చాలా ముఖ్యమైన ప్రక్రియ. ఈ ముద్ర మీ మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ప్రశాంతమైన మనస్సు మంచి ఆరోగ్యాన్నిస్తుంది.
3. **శవాసనం...** ఈ భంగిమ పూర్తి విశ్రాంతి కోసం. సులభమైన ఆసనాలలో ఇది ఒకటి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. శవాసనం మనస్సును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, శరీరానికి విశ్రాంతినిస్తుంది, తలనొప్పి, అలసట, నిద్రలేమిని తగ్గించడం ద్వారా అధిక రక్తపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది.
4. **భుజంగాసన...** భుజంగం అంటే పాము. తలను పాము పడగలా పైకి ఎత్తి, శరీరాన్ని సాగదీయడమే భుజంగాసనం. ఇది రక్త ప్రసరణను, ఆక్సిజన్‌ను మెరుగుపరుస్తుంది. ఈ భంగిమ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. దీంతో శరీరంలో ఫ్లెక్సిబిలిటీ వస్తుంది. ఇది ఆస్తమా రోగులకు కూడా ప్రయోజనకరం.



యోగా ప్రధానంగా ఒత్తిడిని తగ్గించడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆసనాలే కాకుండా ప్రాణాయామం కూడా చాలా ఉపయోగపడుతుంది. ఇది హైపర్ గ్లైసీమియా, అధిక రక్తపోటుకు ప్రధాన కారణాలలో ఒకటి. కపల్‌భతి ఇన్సులిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది.

తిన్న తర్వాత ఇలా చేయొద్దు!

మన అలవాట్లలో కొన్ని మన ఆరోగ్యానికి దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. ఆ అలవాట్లే మన ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తాయి. మనం తిన్న తర్వాత అలవాటుగా చేసే కొన్ని పనులు ఆరోగ్యానికి హానికరం. అందుకే భోజనం చేసిన వెంటనే చేయకూడని కొన్ని పనుల గురించి తెలుసుకుందాం.

టీ, కాఫీ: తిన్న వెంటనే టీ, కాఫీలు తాగే అలవాటు చాలా మందికి ఉంటుంది. అయితే భోజనం చేసిన తర్వాత టీ, కాఫీలు తాగడం ఆరోగ్యానికి హానికరం. ఎందుకంటే ఇది మీ ఆహారం నుండి పోషకాలను గ్రహించడాన్ని నిరోధిస్తుంది.

స్నానం: భోజనం చేసిన తర్వాత స్నానం చేయకూడదు. తిన్న తర్వాత స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత మారుతుంది. దీనితో పాటు జీర్ణక్రియ కూడా దెబ్బతింటుంది. ఇది మీ ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

నిద్ర: కొందరికి భోజనం చేసిన వెంటనే నిద్ర వస్తుంది. అదే సమయంలో కొంతమంది విశ్రాంతి కోసం భోజనం తర్వాత నిద్రపోతారు. అయితే, అలా చేయడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. తిన్న తర్వాత నిద్రపోవడం మీ జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇది తీవ్రమైన గుండెల్లో మంటకు కూడా కారణం కావచ్చు.



వ్యాయామం: కొందరు తిన్న వెంటనే వ్యాయామం చేస్తుంటారు. ఈ అలవాటును వెంటనే మార్చుకోవాలి. మీరు తిన్న వెంటనే వ్యాయామం చేయడం వల్ల అజీర్ణం ఏర్పడుతుంది. ఇది వికారం, వాంతులు, కడుపు నొప్పి మొదలైన వాటికి కారణమవుతుంది.

పండ్లు: భోజనం చేయగానే పండ్లు తినడం వల్ల ఆహారం నుంచి శరీరం తనకు కావలసిన పోషకాలను గ్రహించలేదు. దీనివల్ల అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

మన అలవాట్లలో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల ఆరోగ్యం బాగుంటుందంటే మంచిదే కదా..!